# హైటెక్ ఆంధ్రప్రదేశ్ జిందాబాద్



**ఆ**ంధ్రప్రదేశ్ హైటెక్ రంగంలో ముందుకు పోతోంది. ఆంధ్రప్రదేశ్ కమ్యూనికేషన్ రంగంలో ఇంకా ముందుకు దూసుకుపోయింది.

ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌పోర్ట్ రంగంలో ఇంకా ఇంకా ఫాస్ట్‌గా దూసుకెళ్ళిపోయింది. ఆంధ్రప్రదేశ్ మందుకొట్టడంలో రాకెట్‌కన్నా స్పీడుగా వెళ్ళి నెంబర్ వన్ ప్లేస్‌లో నిలబడింది. ఆంధ్రప్రదేశ్– అబ్బో– ఆ లెవెలే వేరు.

ఒక వంశానికి కాళ్ళు పిసికిన ముఖ్యమంత్రులు, చదువులేని ముఖ్యమంత్రులు, చదువుండీ చదవలేని ముఖ్యమంత్రులు, చెదపట్టిన ముఖ్యమంత్రులూ, హైటెక్

ముఖ్యమంత్రులూ, జలయజ్ఞం ముఖ్యమంత్రులూ– అందరూ కలసి ఆంధ్రప్రదేశ్‌ని ఆ లెవెల్లోకి తీసుకెళ్ళి నిలబెట్టారు.

* * *

నేషనల్ హైవే నెంబర్ నైన్ మీద కారు ఒకటి శరవేగంతో రాజధాని వైపు వస్తోంది.

"ఫోర్‌లేన్, సిక్సలేన్, ఎయిట్‌లేన్ అని గత పాతికేళ్ల నుండి పేపర్లో రాస్తున్నారు. ఆ రోడ్డెక్కడా కనబడదేం?" అనుకున్నాడు శంకర్రావ్.

బహుశా అదంతా పేపర్ న్యూస్ గనుక. ఆ సిక్స్‌లేన్ రోడ్లన్నీ పేపర్ మీద– ఆల్ రెడీ వేసేసినట్లు రాసేసుకుని ఉంటారు.

కాంట్రాక్టర్ జింబాదాద్, ఇంజినీర్లు జిందాబాద్, మినిష్టర్లు జిందాబాద్.

ఆ– రోడ్లు కొంచెం వీక్ అయితే ఏమైందిలే! మిగతా అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్ బాగా ముందుకు దూసుకుని తోసుకుని వెళ్లిపోయిందంటగా!

అంతా ఫారిన్ టైపేనంట్లే!

హైవేల మీద రెస్ట్ హౌస్‌లూ– రెస్ట్‌లెస్ ట్రాఫిక్కూ, బార్ అండ్ రెస్టారెంట్‌లూ, హైవే పెట్రోల్– హైవే హైటెక్ కమ్యూనికేషన్ బూత్స్– ఒకటేంటి, సర్వస్వం. అసలు అమెరికా ఏం పనికొస్తుందని! ఆమెరికా, మిగతా యూరప్ దేశాల్ని ఏనాడో దాటి ముందుకెళ్ళి పోయాం.

ఆహా! రోడ్ చాలా స్మూత్‌గా ఉంది. దీన్నే హైటెక్ రోడ్ అంటారేమో! మరి రోజూ ఈ హైవేల మీద అన్ని ప్రమాదాలు– అంతమంది ఎగిరిపోవటం– ఎందుకని?

వాళ్ళ ఆయుష్షు మూడింది– అంతే! గవర్నమెంట్‌కేం సంబంధంలేదు.

అమ్మో! మరీ రోడ్డు మధ్యలో పార్కు చేశారేంటి లారీలు– బ్రేక్ నొక్కటం ఒక్క క్షణం ఆలస్యం అయుంటే ఆ లారీలోంచి బయటకు పొడుచుకొచ్చిన ఇనుపరాడ్స్ గుండెల్లో దిగిపోయేవి.

అయినా గవర్నమెంట్‌కేం సంబంధం?

అది జనం తప్పు!

అయినా ఓకే! రాష్ట్రాన్ని జుట్టు పట్టుకుని హైటెక్ యుగంలోకి ఈడ్చుకెళ్ళిపోయారు.

అలా ఈడ్చుకెళ్లడంలో బాడీ తాలూకు కాళ్ళూ చేతులూ విరిగిపోవచ్చు. ఒకోసారి బాడీ మొత్తం పోయి, చేతిలో ఉట్టి జట్టు మాత్రమే మిగిలి ఉండవచ్చు. అయినా ఓకే! హాట్సాఫ్ టు గవర్నమెంట్స్!

మూడు ప్రాంతాల్లో వెనుకబడిన జిల్లాల్లో జనం అడక్కు తింటూండవచ్చు.

చదువూ సంధ్యల్లేక మట్టి కొట్టుకుపోయుండవచ్చు. పంటలూ, పొలాలు లేక గడ్డి

తింటూండవచ్చు. అయినా రాజధాని పేరు ప్రపంచమంతా మార్మోగేట్లు చేశారంటే, ఇంత గొప్ప నాయకులు ఇంకే రాష్ట్రంలో ఈఘోరించారని?

అమ్మో! రోడ్ మధ్యలో ఇంత పెద్ద గొయ్యి ఉందేంటీ?

ఓర్నాయనో– దేవుడా రక్షించు–

జ్జ్జా... థడ్–

అమ్మో! హైటెక్ యాక్సిడెంట్– కారు ఎగిరి ఎదురుగ్గా వస్తోన్న హైటెక్ బస్‌కి తగిలి– రోడ్ పక్కనే కార్లు, స్కూటర్లు ఆపి ఉచ్చలు పోసుకుంటున్న వాళ్లను కొంచెంలో మిస్సవుతూ– రోడ్‌మీదే నిలబడి మందు కొడుతూన్న యూత్ తాలూకూ మందు బాటిల్స్‌ని స్మాష్ చేస్తూ–

అమ్మో– తిరగబడిందిరా దేవుడో–

అబ్బ! కళ్లు నెమ్మదిగా తెరుచుకుంటున్నయ్. కారింకా తలక్రిందులుగానే పడుంది. యాక్సిడెంటై చాలా సేపయినట్లనిపించింది. హైవే హైటెక్ పెట్రోలింగ్ ఏమైపోయినట్లు– ఏంటి తలమీద నుంచీ ముక్కు మీదకు కారుతోంది. కొంపదీసి రక్తమా?

ఓర్నాయనో– రక్తమే! అంటే తలకు దెబ్బ తలిగింది. వెంటనే హాస్పిటల్ కెళ్ళకపోతే పైకే ఇక–

ఎవరూ బయటకు లాగటానికి రారేం?

"రక్షించండి! రక్షించండి!"

పక్కనుంచే వెహికల్స్ అన్నీ పోతున్నయ్– ఎవడూ ఆపడేం?

ఎవరివో మాటలు వినబడుతున్నాయ్. ఎవరో దగ్గరకొస్తున్నట్లున్నారు.

"రక్షించండి! రక్షించండి!"

"ఎవరో కార్లోనుంచి అరుస్తున్నట్లు వినిపిస్తోందిరా! ఒకవేళ ఇప్పుడే యాక్సిడెంట్ అయిందేమో. లోపల ఎవరయినా బతికి ఉన్నారేమో చూద్దామా?"

"అరేయ్! ఈ యాక్సిడెంట్ కేసుల్ల తలదూర్చొద్దురా భయ్. తర్వాత పోలీసోళ్ళతోటి కిరికిరి."

"రాజూ నాక్కొంచెం విస్కీ ఇవ్వు. ఇలాంటి యాక్సిడెంట్స్ చూస్తే చాలా డిప్రెసింగ్‌గా ఉంటుంది నాకు"

"యా–షూర్–"

"లెటజ్ గో ఎవే ఫ్రమ్ దిస్ ప్లేస్"

"రక్షించండి– రక్షించండి–"

వీళ్ళకేమయినా జాలి అనేది ఉందా? వీళ్ళసలు మనుషులేనా? గొంతు విని కూడా వెళ్ళిపోతున్నారు. మనుషులు కాదు వీళ్ళు– మృగాలు. ఇంక లాభంలేదు. ఎవడూ

రాడు. ఎలాగోలా బయటపడి ఎవరొకరి సాయం తీసుకుని సిటీకి పోయి, హాస్పిటల్లో చేరాలి. లేకపోతే ఇక్కడే హరిమనేయచ్చు.

అబ్బ! వళ్లంతా దెబ్బలు తగిలినట్లున్నయ్. ఒకటే నొప్పులు. అదృష్టం ఈ కిటికీ వంగలేదు. బయటకు జారవచ్చు– అబ్బ– అమ్మా– ఆహా– బయటికొచ్చేశా– అబ్బ అమ్మా– ఫర్లేదు, లేచి నిలబడగలిగాను– ఎదురుగ్గా మెరుస్తోన్న బోర్డ్ కనిపిస్తోంది. ఏం బోర్డది?

"హైవే ప్రయాణీకులకు హైటెక్ రాష్ట్రం సుస్వాగతం పలుకుతోంది! మీరు ఎలాంటి ప్రమాదానికి గురయినా ఈ ఆంధ్రప్రదేశ్ హైటెక్ కమ్యూనికేషన్స్ ద్వారా తక్షణ హైటెక్ మెడికల్ సేవలు పొందండి. వెంటనే ఫోన్ తీసుకుని తక్షణ సాయం కోసం ఒకటి డయల్ చేయండి–"

రియల్లీ గ్రేట్! అందుకే ఆంధ్రప్రదేశ్‌ని హైటెక్ స్టేట్ అన్నారు– ఊరికే అన్నారా?

క్లింటనే వప్పుకున్నాడు.

"మీ ప్రగతి అద్భుతం' అని. మొత్తం అన్నీ చైనానుంచే దిగుమతి అవుతున్నా ఓకే. ప్రగతి దారి ప్రగతిదే చైనా దారి చైనాదే– అబ్బ! కాళ్ళునొప్పులు– రెండు మూడు ఫ్రాక్చర్స్ అయినా అయ్యుంటాయ్.

ముందు ఒకటి డయల్ చేద్దాం

టింగ్

ఆహా! ఫోన్ పనిచేస్తోంది.

ఇంక నా ప్రాణానికి ఢోకాలేదు–

"థాంక్యూ! మా హైటెక్ కమ్యూనికేషన్ వ్యవస్థను వినియోగిస్తున్నందుకు ధన్యవాదాలు! ఇంగ్లీష్‌లో సంభాషణలకోసం ఒకటినొక్కండి. హిందీమే సున్‌నే కేలియే దో దబాయియే! తెలుగులో వినుటకయి తీన్ దబాయియే"

ఇతరభాషలు మనకెందుకు? మన ఓన్ మదర్‌టంగ్ ఉండగా! అందుకని మూడేనొక్కుదాం– టింగ్

"తెలుగు భాషమీద మీకున్న ప్రేమకు జోహార్లు. తెలుగు భాషకు త్వరలోనే ప్రాచీన భాషాయోగం కల్పించేందుకు ప్రభుత్వం, తెలుగు ప్రజలు కృతనిశ్చయంతో ఉన్నారని తెలియజేయడానికి ఆనందిస్తున్నాం.

దేశబాషలందు తెలుగు లెస్స

ధన్యవాదాలు–

"ఇప్పుడు ఆంధ్రా తెలుగు కావాలంటే ఒకటి నొక్కండి, తెలంగాణా తెలుగు కోసం రెండు నొక్కండి. ఉత్తరాంధ్ర తెలుగుకోసం మూడునొక్కండి. రాయలసీమ తెలుగుకోసం

నాలుగు నొక్కండి."

ఓర్నాయనో ఈ నొక్కడులన్నీ అయేలోపల చచ్చేట్లున్నా! అయినా తప్పేదేముంది? తెలంగాణా తెలుగులోనే విందాం– అంటే ఎన్నినొక్కాలి! ఆ! రెండు–

టింగ్

"తెలంగాణా తెలుగు కోరుకున్నందుకు ధన్యవాదాలు! జై తెలంగాణా!

ఇప్పుడు కొద్దిసేపు వ్యాపార సందేశాలు వినండి. శంషాబాద్ ఎయిర్‌ఫోర్ట్ గోడనానుకుని ఉన్న విచ్చలవిడి రియల్ ఎస్టేట్ కంపెనీలో నేడే మీ ప్లాట్ బుక్ చేసుకోండి. 500 గజాలు, వెయ్యి గజాల ప్లాట్లు అతిసరసమయిన ధరలకే మీ సొంతం చేసుకోండి! ఒక ప్లాటు కొన్నవారికి ఒక కారు ఉచితం.

టింగ్ టింగ్

ప్రమాదంలో గాయపడ్డారా?

వెంటనే 'శాశ్వతం' మల్టీస్పెషాలిటీ హాస్పిటల్లో చేరండి! మూడు నెలలపాటు ఇన్‌పేషెంట్‌గా ఉన్నవారికి– మూడు రోజుల సింగపూర్ యాత్ర ఉచితం. (రానూ పోనూ విమాన ఛార్జీలతో సహా)

ఆరు నెలల ఇన్‌పేషెంట్‌గున్నవారికి ఒక మినీ హెలికాప్టర్ (వన్ సీటర్) ఉచితం! (చైనా మేడ్) సంవత్సరంపాటు ఇన్‌పేషెంట్‌గా ఉన్నవారికి– తర్వాత బతికి బట్టకడితే ప్రముఖ సెక్సీ సినీనటి రతీదేవితో మూడు రాత్రులు ఉచితం–

వెంటనే మా శాశ్వతం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్లో చేరండి–"

టింగ్–టింగ్–

ఓర్నాయనో ఈ వ్యాపార ప్రకటనలు పూర్తయ్యేసరికి ఛావటం ఖాయం.

రక్తం మొత్తం పోతోంది. తలకూడా దిమ్ముగా అయిపోతోంది.

టింగ్– టింగ్

"ఇగో– గిప్పుడు– హైదరాబాద్ తెలుగిట్ట ఇనాలనుకుంటే ఒకటి నొక్కండ్రి!

డిస్ట్రిక్ట్ తెలుగు కావాల్నానుకుంటే రెండు నొక్కండ్రి.

ఖమ్మం ఏరియా తెలుగు కావాల్నానుకుంటే మూడు నొక్కండ్రి."

అబ్బా– మళ్ళీ ఇందులో ఇన్ని రకాలా? సరే హైదరాబాద్ తెలుగే విందాం.

టింగ్–

"బహుత్ షుక్రియా భాయిసాబ్! ఇగో– నీది కారాక్సిడెంట్ గిట్టయితే ఒకటి దబాయించు. అగర్ స్కూటర్ యాక్సిడెంటయితే దో నంబర్ దబాయించు"

ఓర్నాయనో– ఈ నొక్కుళ్ళు నావల్ల కాదు– వళ్ళంతా కూడా దిమ్ముగా అవుతోంది.

అబ్బా! ఒకటి నొక్కితే వెంటనే సాయం వస్తుందేమో–

టింగ్–

"షక్రియా! అగర్ యాక్సిడెంట్ పెద్దది గిట్టయితే ఏక్ నెంబర్ దబావ్– మీడియం అయితే దో నెంబర్ దబావ్– లైట్ యాక్సిడెంటయితే లైట్ లేలో భాయ్–"

అబ్బా– ఇంక నావల్ల కాదు. చక్కెరొచ్చేస్తోంది. ఈ ఫోన్ ఛావాలనుకునే వాడికి ఉపయోగపడుతుందిగానీ బ్రతకాలనుకునే వాడిక్కాదు. అబ్బా– హమ్మా– నేను ఇంకా బ్రతికున్నానా, పైకెళ్ళి పోయానా? అదిగో ఇంకా కార్ల శబ్దాలు, లారీల శబ్దాలూ వినబడుతూనే ఉన్నయ్. అంటే బ్రతికే ఉన్నానన్నమాట!

దేవుడా– ఎలాగోలా ఒక్కసారి ఆ ఒకటి బటన్ నొక్కే శక్తి నివ్వు– లేదా ఒక పెగ్గు రమ్ సప్లయ్ చేయించినా ఓకే– అప్పుడు శక్తి వచ్చి నేనే బటన్ దబాయిస్తా–"

బటన్ ప్రెస్ చేశాడు.

అమ్మయ్య– నొక్కాను. దీన్నే ఆఖరి బటన్‌గా మార్చే వరం ప్రసాదించు స్వామీ– ఇదే ఆఖరి బటనవాలి– ఇదే– ఆఖరిబటనవాలి– ఇదే ఆఖరిబటనవాలి– స్వామీ– స్వామీ– దేవుడా– దేవుడా–

ట్రింగ్–

మళ్ళీ టేప్ వాయిస్–

"అగర్ తుమ్ ఫైవ్‌స్టార్ హాస్పిటల్‌మే చేరాల్లనుకుంటే ఒకటి దబాయించుండ్రి! లగ్జరీ హాస్పిటల్‌మే జేరాలనుకుంటే దో నెంబర్ దబావ్–"

నీయవ్వ– ఇంకెన్ని సార్లు నొక్కాల్రా! నా ప్రాణం పోతోందిరా– నీయవ్వ– ఎడ్వాన్స్‌డ్ హైటెక్ అంటే మందిని మసిచేసేయటమా? థూ– నీయవ్వ– అబ్బా– అమ్మా– నేను ఛావటం ఖాయం!

"ఇప్పుడు ఒక బ్రేక్–

ఒకవేళ మా సహాయం అందేలోపల ఈ యాక్సిడెంట్లో మీరు ఛస్తే– మీకళ్ళు దానం చేయడానికి అంధేరా హీ అంధేరా సంస్థను సంప్రదించండి! మిగతాదంతావాళ్ళు చూసుకుంటారు.

మీ కిడ్నీలు వగైరాలు దానం చేయాలనుకుంటే అండర్‌గ్రౌడ్ డాన్ దావూద్‌ని సంప్రదించండి"

టింగ్ – టింగ్–

"మీరు ఎయిడ్స్‌తో బాధపడుతున్నారా? ఫస్ట్ ఎయిడ్ అండ్ లాస్ట్ ఎయిడ్ కోసం డెస్టినీ ఇంటర్నేషనల్‌కి ఫోన్ చేయండి!"

టింగ్ టింగ్–

"మీరు మళ్ళీ మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నారా?

హేరమ్ మారేజ్‌బ్యూరోలో రిజిష్టర్ చేసుకోండి– ఫీజు లక్ష– గాళ్స్ లక్షలు–"

టింగ్–టాంగ్–

"జబర్దస్త్ రుచికి గబ్బర్‌సింగ్ అప్పడాల్నేవాడుడు. గబ్బర్‌సింగ్ అప్పడాలు–"

ఓరి దేముడో– ఈ చెత్తనా కొడుకులు ఈ వ్యాపార ప్రకటనలు ఆపేదెప్పుడు? నేను బ్రతికి బట్టగట్టేదెప్పుడు.

టింగ్ టాంగ్–

"వెల్‌కమ్ బాక్ టు ఆంధ్రప్రదేశ్ హైవే కమ్యూనికేషన్స్– అగర్ తుమ్ ఫైవ్‌స్టార్ హాస్పిటల్‌మే జాయినవ్వాలంటే ఒకటి దబాయించండ్రి– సూపర్ లగ్జరీ హాస్పిటల్లో జేరాల్నునుకుంటే రెండు దబాయించండ్రి! గవర్నమెంట్ దవాఖానాలో జేరాల్నునుకుంటే మూడు నొక్కండి–"

అబ్బా– ఏదొకటి నొక్కుదామంటే చేయిలేవటం లేదు. ఏమైంది? పక్షవాతం వచ్చిందా? ఎలాగోలా నొక్కాలి– లేకపోతే ఛావుఖాయం– చావు దగ్గర కొచ్చినట్లు తెలుస్తూనే ఉంది. చేయి లేపడానికి ప్రయత్నిస్తున్నా సగం లేచి పడిపోతోంది–

"మాఫ్ కీజీయే– మీరు ఏ బటనూ దబాయించటం లేదు– మీరు మళ్ళీ మెనూ మొదటి కెళ్ళాలంటే తొమ్మిది డయల్ చేయండి–"

నీ యవ్వ ఇక్కడికే చస్తోంటే మళ్ళీ మొదట్నుంచా?

"సారీ మీ సమయం మించిపోయినది!

ఆంధ్రప్రదేశ్ హైటెక్ కమ్యూనికేషన్స్ ఉపయోగించుకున్నందుకు మీకు ధన్యవాదాలు!

బహుత్ షుక్రియా!

థాంక్ యూ–"

ఆఖరి ప్రయత్నంగా మళ్ళీ చేయిలేపడానికి ప్రయత్నిద్దాం– కొంచెం పైకిలేచి చేయి ధబేల్‌మని పడిపోయింది.

దాంతో గావుకేకపెట్టాడు.

ఆ తర్వాత అతని మొఖంలో ఆనందం– శ్వాసం ఆగిపోయింది. కళ్ళు శాశ్వతంగా మూసుకుపోయినయ్.

* * * * *

కొద్దిక్షణాల తర్వాత నిద్రమెలకువ వచ్చినట్లయి లేచి నుంచున్నాడతను.

"అరె– భలే నిలబడ్డానే– ఇంత శక్తి ఎక్కడినుంచి వచ్చింది– అరె– ఈ దెబ్బలన్నీ

కూడా మాయమైపోయాయే! ఎలా జరిగిందిది?" అంటూ చుట్టూ చూశాడు.

ఒక్కసారిగా షాకయ్యాడు.

"ఓర్నాయనో– అదిగో– నా శరరం అక్కడే పడుంది– అంటే నాలోని చిలకెగిరి పోయిందా? నేను పైకెళ్ళి పోయానా?–

అవును! డౌట్ లేదు– నేను చచ్చిపోయాను–

ఆహా! హైటెక్ ఆంధ్రప్రదేశ్ పుణ్యమా అని ఈ పాడు మానవ జన్మ నుంచి విముక్తి పొందగలిగాను–

అంటే నేను యమలోకాని కొచ్చానా?

అదే కరెక్టయితే ఇక్కడ చిత్రగుప్తుడు, యమధర్మరాజు, యమభటులూ– వీళ్ళంతా ఏరీ?

హఠాత్తుగా పెద్ద సౌండ్‌తో ఓ లేడీ వాయిస్ వినిపించింది.

"మా హైటెక్ యమలోకానికి స్వాగతం– సుస్వాగతం! చిత్రగుప్తుడు, యమధర్మరాజు మిమ్మల్ని ఎంతో ప్రేమతో ఆహ్వానిస్తున్నారు. తదుపరి ప్రొగ్రామ్స్ కోసం మీరు సంసిద్ధంగా ఉండండి– యమలోకం హైటెక్ సర్వీస్‌లను వినియోగించుకోవడానికి– యమ ట్రిక్ కమ్యూనికేషన్స్ నెట్‌వర్క్‌ని ఉపయోగించుకోండి!

మీరు వృద్ధులయితే ఒకటి నొక్కండి.

మధ్య వయస్కులయితే రెండు నొక్కండి.

పిన్న వయస్కులయితే మూడు నొక్కండి"

అతనికి కళ్ళు తిరిగినట్లనిపించినయ్. రెండు చేతుల్తో తలపట్టుకుని నేలమీద కూలబడిపోయాడు.

ఓర్నాయనో– ఈ యమలోకానిక్కూడా హైటెక్ రోగం తలుగుకుందా? ఇక్కడయినా ప్రశాంతంగా ఎంటరయే ఛాన్స్‌లేదా?

"క్షమించండి! మీరు మీ ఛాయిస్‌ని ఉపయోగించుకోవటం లేదు. సమయం మించుతే మీరు అటూ ఇటూ కాకుండా అయిపోతారు." మళ్ళీ మోగింది గొంతు–

"అమ్మో! అటూ ఇటూ కాకుండా అంటే నరకం కంటే డేంజరస్ ఇంకోటేదయినా ఉందేమో– వెంటనే రెండు నొక్కటం మంచిది–" అంటూ రెండు నొక్కాడు.

"ఒకటి నొక్కనందుకు ధన్యవాదాలు–

మీద సహజ మరణమయితే ఒకటినొక్కండి

ఆత్మహత్య అయితే రెండు నొక్కండి–

హత్యకు గురయితే మూడు నొక్కండి.

టెర్రరిస్ట్ దాడిలో ఛస్తే నాలుగు నొక్కండి–

వరదలు– సునామీ, భూకంపాల వల్ల పైకొస్తే అయిదు నొక్కండి–

ఆంధ్రప్రదేశ్ హైటెక్ పుణ్యమా అని ఇక్కడి కొస్తే ఆరునొక్కండి–"

ఓర్నాయనో– కథ మళ్ళీ మొదలయినట్లుంది–

అంటే నేను ఆరునొక్కాలన్నమాట– అనుకుంటూ ఆరునొక్కాడతను–

"మీరు మగయితే ఒకటి నొక్కండి–

ఆడయితే రెండు నొక్కండి.

రాజకీయ నాయకుడయితే మూడు నొక్కండి–"

ఓరి యముడో– నీ యమట్రిక్ కమ్యూనికేషన్స్‌తో మళ్ళీ నేను రెండోసారి చచ్చేట్లున్నాన్రా దేవుడా– అంటూ ఒకటి నొక్కాడతను–

"ధన్యవాదాలు! మీరు పాపములు ఎక్కువ చేసి ఉంటే ఒకటి నొక్కండి– పుణ్యాలు ఎక్కువ చేసినట్లయితే రెండు నొక్కండి."

అబ్బా– అయినా చిత్రగుప్తుడు ఇక్కడలేడు కాబట్టి ఎక్కువ పుణ్యాలు చేశామంటే ఎవడు కాదంటాడు? అందుకని రెండే నొక్కుదాం– అంటూ రెండు నొక్కాడు.

"మీరు స్వర్గానికి అర్హులనుకుంటే ఒకటి నొక్కండి–

నరకానికి అర్హులనుకుంటే రెండు నొక్కండి–"

ఆహా! అంటే పుణ్యాలు ఎక్కువ చేసినట్లు వాళ్ళు వప్పుకున్నారన్నమాట! అయితే నేను చాలా లక్కీ! స్వర్గమా, నరకమా అనే ఛాయిస్ నాకే ఇస్తున్నారంటే– యమలోకం నిజంగానే చాలా అడ్వాన్స్ అయిపోయినట్లే– అయినా వాళ్ళ పిచ్చిగానీ ఛాయిసిస్తే ఎంత తెలివి తక్కువాడయినా నరకానికెందుకెళ్తాడు? అహ్హహ్హా! అందుకని ఒకటే నొక్కుదాం. అంటూ ఒకటి నొక్కాడు.

"సారీ– మీరు స్వర్గానికి అవుటాఫ్ కవరేజ్ ఏరియాలో ఉన్నారు. మీరు చేసినవన్నీ పాపాలయినా కూడా పుణ్యాలు చేసినట్లు యమలోకాన్ని మోసగించడానికి ప్రయత్నించారు– గనుక మీకు నరకంకన్నా నరకమైన– పరమనికృష్ట నరకం– అనే కొత్త నరకానికి పంపిస్తున్నాం–"

ఓర్నాయనో ఈ పరమనికృష్ట నరకం అంటే ఎలా వుంటుందో ఏమో– అనవసరంగా అబద్ధమాడి బుక్కయిపోయానే– ఇప్పుడెలా?

హఠాత్తుగా నెత్తిమీద రెండు కొమ్ములతో ఓ యువతి ప్రత్యక్షమయింది.

"పరమనికృష్ట నరకానికి స్వాగతం– సుస్వాగతం! మిమ్మల్ని అక్కడికి తీసుకెళ్ళడానికి నేను వినియోగించబడ్డాను– దయచేసి నన్ను అనుసరించండి!"

ఆమె ముందు నడుస్తోంటే భయంతో వణుకుతూ ఆమె వెనుకే బయల్దేరాడతను.

"మేడమ్– అసలు నరకమంటేనే మేం ఉచ్చపోసుకుంటాం! ముక్కలు ముక్కలుగా నరకటం– నూనెలో వేయించటం– దబ్బాలాలతో పొడవటం– లాంటి ఎన్నో రకాల శిక్షలుంటాయని మాకు తెలుసు!

అలాంటిది ఈ పరమనికృష్ట నరకం అంటే ఏంటి మేడమ్? ఇంకేమేం శిక్షలుంటాయ్ అక్కడ? ఇంకెన్ని రకాల చిత్రవధలు పెడతారు? అవన్నీ మేం భరించగలమా?"

ఆమె నవ్వింది.

"పాపాలు చేశాక శిక్ష తప్పదు మానవా! పరమనికృష్ట నరకం అంటే మామూలు నరకం కన్నా వెయ్యిరెట్లు చిత్రవధలుంటాయ్.–

కానీ– అవన్నీ మోడ్రన్ పద్ధతుల్లో ఉంటాయ్. మిమ్మల్ని సలసల కాగే నూనెలో వేయించకుండానే దానికి వెయ్యిరెట్లు నరకయాతన పెట్టే ప్రదేశం అది! ఓకే– ఇంక నేను వెళ్తున్నాను!"

అతను షాకయ్యాడు.

"అరె హలో మిస్! నన్ను ఆ స్పెషల్ నరకానికి తీసుకెళ్ళకుండానే వెళ్తున్నానంటున్నారేంటి?"

"పిచ్చివాడా– సరిగ్గా చూడు– నువ్ నుంచున్న ప్రదేశమే పరమ నికృష్ట నరకం!"

అతను చుట్టూ చూసి మళ్ళీ షాకయ్యాడు.

"అరె– ఇది హైద్రాబాద్ నగరం మిస్! ఇదేం స్పష్టంగా తెలుస్తోంది– సౌండ్ పొల్యూషన్, ఎయిర్ పొల్యూషన్, ఫుడ్ ఎడల్టరేషన్, పాలిటిక్స్ పొల్యూషన్– వయొలెన్స్ పొల్యూషన్– సెక్స్ పొల్యూషన్– ముఖ్యమంత్రుల ఫ్రాడ్ పొల్యూషన్, – ఖచ్చితంగా ఇది హైదరాబాదే–"

యువతి చిరునవ్వు నవ్వింది.

"పిచ్చివాడా హైదరాబాదే పరమనికృష్ట నరకం! అతి భయంకరమయిన పాపాలు చేసినవాళ్ళందర్నీ ఇప్పుడు మా నరకం తాలూకు పరమనికృష్ట నరకం బ్రాంచ్ అయిన హైదరాబాద్‌కే పంపుతున్నాం! మా నరకంలో ఈ బ్రాంచ్‌ని హైదరాబాద్‌కి అవుట్ సోర్సింగ్‌కిచ్చాం!"

* * * * *